


# యశోద విలాపం

నీల

నాకు వాడిని చూస్తే భయం వేసింది.

ఒక్క సంవత్సరం ఉంటుందేమో వాడి వయస్సు నల్లటి బొచ్చుతో ఎలుగుబంటి పిల్లలా వున్నాడు. పాపం వాడూ వణుకుతూ భయపడుతూ వున్నాడు.

వాడు నా గోపన్న.

గోపన్న లేకుండ ఎనిమిది నెలలు గడిచి పోయాయి. ఎలా ? కనీసం రోజుకు నాలుగు సార్లు అయినా తలచుకోకుండా వుండ లేకపోతున్నా. తలచుకొన్నప్పుడంతా ఏడుపే.

ఎన్ని జ్ఞాపకాలో. మరి నాకు ఇంత దగ్గరవుతాడాని 10 సంవత్సరాల క్రిందట అనుకోనేలేదు.

నా జీవితం తో బాగా ముడిపడిపోయి, మాయని మొంజేతి పచ్చగా మిగిలిపోయాడు.

10 సంవత్సరాల కిందట నేను మావారు మయామి కి వెళ్ళాము, అబ్బాయి ని చూడడానికి. వాడికి రెసిడెన్సీ మయామీ లో వచ్చింది. ఒక్క వారం రోజులు ఉండి, చివరి రోజు వెళ్లి పోదామని అనుకున్నప్పుడు వాడు ఓ కుక్కను పెంచు కుంటానని మొండి కేసాడు.

ఒక్కగానొక్క కొడుకు ఏది అడిగిన వద్దని చెప్ప లేదు.

నాకైతే కుక్కలు అంటే చచ్చేంత భయం. 'వద్దు రా, దానితో చాలా పని ఉంటుంది. పెంచడం కష్టం' అని ఎంతో చెప్పాను. చివరకు, వాడు ఒంటరిగా కష్టపడు తున్నాడు, కుక్క తోడు ఉంటుందిలే అనుకొని ఒప్పుకోవలసి వచ్చింది.

తప్పదని వాడు, నేను, మావారు పొద్దున్నే 10 గంటలకు అలా ఆడాప్షన్ సెంటర్ కి వెళ్ళాము.

ఎన్నికుక్కలో! ఒక్కొక్క బోనులో నాలుగు నుండి ఐదు కుక్కల్ని పెట్టారు. జాలిగా చేతులు చాచి అరుస్తున్నాయి. నాకు భయం జాలి రెండు వేసాయి.

వెతికి వెతికి మా గోపన్న ఉన్న బోన్ దగ్గరికి చేరాము. వాడు ఎగిరి అల్లరి చేస్తున్న నాలుగు కుక్కల వెనుక నిశ్శబ్దంగా కూచొని వున్నాడు.

ఎందుకో తెలీదు, మా వాడు వాడిని కావాలన్నాడు. బహుశా గొప్పన్న పెద్ద కళ్ళు వాడిని ఆకర్షించాయేమో. ఒక్కమ్మాయి, అడాప్షన్ సెంటర్ వాలంటీర్, వచ్చి వాడిని బయటకు తెచ్చింది. మా వాడు చాలా సులభంగా ఎత్తు కొన్నాడు. అక్కడి ఫార్మాలిటీస్, పేపర్ వర్క్ అయ్యాక బయటికి తెచ్చాము. వెంటనే "పాటికి" పోయాడు. ముచ్చటేసింది. వాడెప్పుడూ అంతే. అతి నీటు గాడు.

నేను మాత్రం వాడి కంటే ఎక్కువ భయపడుతూ సన్నగా వణుకుతూ, వాడిని మొదటగా ఎత్తుకున్నాను. వాడు వెంటనే నా వడిలో ఒదిగి పోయాడు.

కార్ లో వాడి గురించే మాట్లాడుతూ వచ్చాము. వాడి పేరు ఆర్నీ అట. మేము ఏమి పేరు పెడదామని ఆలోచించాం.

మా వాడు సలహా ఇచ్చాడు, నల్లగా వున్నాడు కదా, కృష్ణుని పేరు పెడదామని. క్రిస్ అయితే అమెరికా లో సరి పోతుందేమో అనుకున్నా, గోపన్న అనడంలో ఉన్న అప్యాయిత మా నిర్ణయాన్ని ఖరారు చేసింది.

ఆరోజు ఫ్లైట్ లో రాత్రి భయాలు దేరి అయోవా లో సిడర్ రాపిడ్స్ కు వచ్చేసాము. నాకు మాత్రం మా వాడు గోపన్నను ఎలా చూసుకొంటాడో అని దిగులుగా ఉండేది. గోప్పన్న గురించి కాదు, మా వాడి గురించి. చదవాలి వంట వండు కోవాలి, ఇల్లు శుభ్రం చేసుకోవాలి, మరి గోపన్న ను చూసికొనే టైం ఉందా అని?

తరచూ, మేము సిడర్ రాపిడ్స్ నుండి మయామి వేళ్లుతుండే వాళ్ళము. వెళ్ళి నప్పుడంతా వాడితో బాగా స్నేహం కుదిరింది. మళ్ళీ తిరుగు ప్రయాణం లో మా అబ్బాయిని వదులుతున్న బాధ తో పాటుగోపన్న ను వదలడం కూడ బాధ వేసేది. ఒకరికొకరు తోడు ఉంటారు, ఆనందం పంచుకొంటారు, మా వాడి స్ట్రెస్ తగ్గుతుందని అనుకొనేదాన్ని.

కొన్ని రోజుల తరువాత గోప్పన్నను చూస్తే జాలి వేసేది. అమ్మ నాన్న లేరు, వాడి జాతి కూడా కాని మనతో కలవడం పాపం అనిపించేది. నేను మొదట అమెరికా వచ్చినప్పుడు అమెరికెన్స్ తో కలవడం చాలా కష్టమని అనుకునే దాన్ని. అయినా వాళ్ళు కూడా మనుష్యులే కదా అన్ని అలవాటు పడ్డాను. ఇప్పుడు చాలా మంది అమెరికన్లు నాకు చాలా సన్నిహితులు. మరి గోపన్న కు..?

కొన్ని రోజుల తరువాత మా అబ్బాయి గోప్పన్నను థెరపీ డాగ్ ట్రైనింగ్ క్లాసులకు వారంతము లో తీసుకెళ్లడం మొదలెట్టాడు. ఇంట్లో ఒంటరిగా వదిలి హాస్పిటల్ కు వెళ్ళేటప్పుడు ఇల్లు తీసి పందిరి చేస్తాడని, వాడితో పాటు గోపన్నను థెరపీ డాగ్ లాగా ట్రైన్ చేసి హాస్పిటల్ కు తీసుకెళ్లాలని వాడి ఉద్దేశం. సంవత్సరం క్లాస్ లు తీసుకున్నాక, గోపన్న పరీక్షలు పాస్ అయ్యాక, అదే పని చేశాడు. గోపన్న కార్లో ప్రతి రోజు మా అబ్బాయితో వెళ్లడం, అక్కడ పిల్లల హాస్పిటల్ లో ఓ నర్స్ కు గోపన్నను అందజేయడం అలవాటు చేసుకొన్నాడు. గోపన్నకో చిన్న గది కేటాయించారు. రోజు

ఇచ్చిన ట్రీట్ తిన్నాక, హాస్పిటల్ లో ఉన్న చిన్న పిల్లల వార్డ్ లో ఒక్కొక్క రూమ్ కు వెళ్లి పిల్లలకు హగ్ లు యిచ్చి, వాళ్ళు ఆనంద పడేలా చేయడం గోపన్న డ్యూటీ. అలా, పిల్లలతో ఆడుకొని, మళ్ళీ వాడి రూమ్ కు వెళ్లి ట్రీట్, లంచ్ తిని మా అబ్బాయి కోసం ఎదురు చూస్తూ వుండే వాడట. సాయంత్రం మా అబ్బాయితో పాటు కార్ లో ఇంటికి వచ్చేవాడట. యిలా సంవత్సరం చేసాడు. అప్పటికి వాడి వయస్సు మూడు సంవత్సరాలు. అంత మంది పిల్లలకు సంతోషాన్ని ఇచ్చాడు. అందులో కొందరు టెర్మినల్ క్యాన్సర్ తో బాధ పడుతూ ఉండేవారు. పిల్లలు అందరూ వీడి కోసం ప్రతి రోజు ఎదురు చూపులు. హాస్పిటల్ లో చాల మంది కి అతి త్వరలోనే ఆప్తుడయ్యాడు.

గోపన్న, నువ్వు ధన్య జీవిరా కన్నా..!

వాడి ఇన్స్పిరేషన్ ఏమో నాకు బాగా వాలంటరీ వర్క్ చేయాలనిపించి, చేయడం మొదలెట్టాను.

అలా 3 సంవత్సరాలు అయ్యాక, మా అబ్బాయికి ఫెలోషిప్ రావడం, చేరి పోవడం, హాస్పిటల్ దగ్గరలో చిన్న ఇంటికి మారిపోవడం జరిగింది. మేము ఆలోపల టాంపాకు రీలొకేట్ కావడంతో, మా అబ్బాయి, గోపన్నను బలవంతంగా మా కప్పగించేసాడు. ఫెలోషిప్ అయ్యిన వెంటనే గోపన్నను మళ్లీ తీసుకెళ్తాను అని చెప్పడం వల్ల, మేమూ ఒప్పుకోవల్సి వచ్చింది. మొదట్లో గోపన్న, మావాడిని మిస్ అవుతున్నట్టు అనిపిచ్చింది. 'అన్న ఎక్కడ?' అంటే వెతుక్కుంటూ ఉండేవాడు.

మొదట్లో గోపన్న ను ఉంచుకోవడం కష్టమనిపించిందికాని కొన్ని రోజులలోనే బాగా దగ్గరయ్యాడు. వాడు మా రొటీన్ కి తొందరగానే అలవాటు పడిపోయాడు.

రోజు మాతో పాటే లేవడం, మావారు పెట్టిన తిండి తిని, నీళ్లు త్రాగి బయటకు మా వారితో పాటు వాకింగ్ వెళ్ళేవాడు. నేను ప్రీస్కూల్ లో పని చేసేదాన్ని. అందుకని ప్రొద్దున్నే వాడితో వెళ్లడం కుదిరేది కాదు. కానీ నిజం చెప్పాలి. వాడు మావారితో చిట్టి అడుగులు వేస్తూ, త్వరగా నడవడం ఎంత ముద్దు వచ్చేదో. నేను పార్ట్ టైం పని చేసేదాన్ని కాబట్టి మధ్యాహ్నం కల్లా తిరిగి ఇంటికి వచ్చేసేదాన్ని. నేను రాగానే, వాడు పడే ఆనందం చూస్తే ఇంటికి ఎప్పుడెప్పుడు వెళ్దామా, వాడ్ని చూద్దామా అనిపించేది. వాడి తిండి రెడిగా ఉన్నా, ఎప్పుడు తినే వాడు కాదు. నేను తింటున్నప్పుడే తినేవాడు. నాతో పాటు ఒక గంట నిద్రపోయేవాడు. మళ్ళీ లేచి నాన్న కోసం ఎదురూ చూపులు. తలుపు దగ్గరే తచ్చాడు తుండేవాడు. అంతే, మా వారు వచ్చేంత వరకు లోపలికి రాడు. తరువాత మా ఇద్దరి తో కలిసి వాకింగ్. వాడికి ఎలాతెలుసో, సాయంత్రం అయితే ఇద్దరూ రావాలి. నేను సాయంత్రం రాక పోతే, నా వెనుక వచ్చి, తన చిట్టి కాళ్ళతో ముందుకు తోసేవాడు. తప్పకుండా వెళ్లాల్సిందే.

యింటికి తిరిగి రాగానే, శుభ్రం చేయించు కొనిగాని లోపలికి అడుగు పెట్టడు. రెండు వారాలకి ఒక్కసారి స్నానం చేయించేదాన్ని. వాడికి నీళ్లు అంటే ఇష్టం ఉండేది కాదు. నేను వేడినీళ్లు తిప్పి, వాడి తువ్వాలు తీసుకొనేటప్పుడు ఎలా కనుకొంటాడో గాని, మంచం కింద దాక్కొని, మొహం మాత్రం బయట పెట్టేవాడు. నేను ఇంకో గదికి వెళ్ళగానే

బయటకు వచ్చేవాడు. వాడిని పట్టుకొని, ఒక్కసారి సింక్ లో పెట్టానంటే దాసోహం అయిపోతాడు. వాడికి స్నానం చేయిస్తూ ఎన్ని కబుర్లో.బుజ్జి బుజ్జి పాపై పాట పాడుతూ, పొగుడుతూ ఉంటే సంతోషంగా చేయించుకొనేవాడు. ఎన్ని జ్ఞాపకాలు.

గొప్పన్నకు తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషలు, వచ్చు. ఏది చెప్పినా అర్థం అవుతుంది. నేను వంట చేస్తూ, 'నాన్నను పిలుచుకురా' అంటే వెంటనే వెళ్లి మా వారిని పిలిచికొని వచ్చి, పెద్ద ఘనకార్యం చేసిన వాడిలా తోక బాగా ఆడించే వాడు. గర్వంగా నా మొహం చూసేవాడు.

వాడి మొహం ఎంత ముద్దుగా వుండేదో. వాడిని చూసి ' నల్ల పట్టు ,' అని కూడా పిలిచే దాన్ని. అంతటి నలుపులో తెల్లటి పెద్ద కళ్ళు, అందులో అందమైన నల్లటి కను పాపలు. ఆ కళ్ళలో ఏమి చెప్పిన అర్థం చేసుకోవడానికి వాడు పడే తపన. నలుపు కూడా ఇంత అందంగా ఉంటుందని, నాకు గోపన్న ను చూసిన తరువాతే అర్థం అయ్యింది.

ఎక్కడికి వెళ్ళవు నాన్న ఈ అమ్మను వదిలి?

సోఫా లో కూచున్నా, పడకలో పడుకున్నా, నా పక్కనే వాడి శరీరం హత్తుకొని ఉంటుంది. ప్రొద్దున, సాయంత్రం రెండు పూటలు ' జేజి మొక్కు నాన్న ' అంటే నాలుగు కాళ్లు ముందు పెట్టి సాష్టాంగ నమస్కారము చేసేవాడు

మరి దేవుడు ఎందుకు తీసుకెళ్లాడు?

అందుకనేనేమో.

ఈ ప్రపంచం ఎంత పెద్దది?

వాడు తన చిన్న ప్రపంచంలో, ఏదో ఒక మూలలో వుంటే, దేవుడికి వాడి మీద ఎందుకు కన్ను పడింది?

ఇంకా మంచి జన్మ ఇస్తాడేమో నా బంగారుకి.

వాడు మాతో పాటు, రోజు మా మధ్యలో పడుకొనేవాడు. ఒకసారి నిద్రలో తిరిగి పడుకోబోయి, మంచం మీద నుంచి, కింద పడిపోయాను. చేయి మీద పడ్డానేమో, చచ్చేంత నొప్పి. వాడు దూకి నా పక్కనే కూచున్నాడు. వాడి కళ్ళలో ఆదుర్త. మావారు లేచి, ఐస్ పాక్ తెచ్చిపెట్టారు. ఆ చిన్న మెదడుకు ఎలా ఆలోచన వచ్చిందో! మరుసటి రోజు నుండి నేను పడిన వైపు కాళ్ళ దగ్గరపడుకోవడం మొదలు పెట్టాడు. నేను పడకుండా వారధి లాగా.

నీలా నన్ను ఎవరు చేసుకొంటారు నాన్న. ఒక అమ్మ తప్ప. అమ్మంటే గుర్తు వచ్చింది. మా అమ్మ వయస్సై మమ్మల్ని వదలి వెళ్ళిపోయింది. కోవిడ్ వల్ల వెళ్ళలేక పోయాం. అమ్మ పోయిన 4 రోజులకు, పెద్ద అక్క కూడా కోవిడ్ తో పోయింది. ఎంత బాధ పడ్డానో. అలాంటి నేను, ఒక్క సంవత్సరం లోనే మాములు అయ్యాను అంటే 100 % గొప్పన్న

నే కారణం. వాడికి నేను బాధ పడుతున్నట్లు తెలిసిపోయేది. ఓదార్పుగా వెన్నంటే ఉండి, నా వైపే కన్నార్పకుండా చూస్తుండే వాడు. వాడ్ని చూసి నప్పుడు నా కనిపించేది, 'పాపం వాడికి అమ్మ నాన్న ఎవ్వరు లేరు. మేమే వాడికి అన్ని' యిలా ఆలోచిస్తూ మాములు అయ్యనేమో.

ఇక్కడ అమెరికాలో కొన్ని షాప్స్ లోకి మాత్రమే కుక్కలని తీసుకెళ్లవచ్చు. గోపన్నకు మాతో బాటు కార్ట్ లో కూర్చొని షాపింగ్ చేయడం ఇష్టం. సామ్స్ క్లబ్ వెళ్దాం, అంటే మహా ఆనందం వాడికి. కార్ లో ఆనందంగా కూచొని వస్తాడు. షాప్ లోపల కార్ట్ లో పెద్ద అట్ట డబ్బా పెడితే, దాని మీద రాజులా కూచొని అటూ ఇటూ చూస్తు ఆనందంగా ఉంటాడు. వీకెండ్స్ లో సామ్స్ లో శాంపిల్స్ ట్రీట్స్ గా ఇస్తారు. ఎలాగుర్తు పడతాడో తెలీదు. అలా ట్రీట్ ఇచ్చే చోట్ల లో పైకి లేచి నిలుచుంటాడు. చిన్న ముక్క వాడికి అడిగి తీసుకుంటాడు. ఇష్టంగా తినే వాడు. అక్కడ చూసిన జనం అంతా, ఎంత క్యూట్ గా ఉన్నాడని అంటూనే ఉంటారు. థెరపీ డాగ్ కదా. వాడి నమ్రత గురించి చెప్పాలా. చెప్పొద్దు నాకు ఎంత గర్వంగా ఉండేదో.

మరి నువ్వు లేకుండాన సామ్స్ ఎలా వెళ్ళు తున్నాను గోపుషా? వెళ్లి నప్పుడంత కళ్ళలో నీళ్లు రాకుండా ఉండదు. ఎలావదిలి వెళ్లావు రా కన్నా, అమ్మను.

సామ్స్

నేను వెళ్ళ లేదు నువ్వే పంపావు అమ్మ అంటున్నావా? ఏమిచేయను నాన్నా, నువ్వు పడే బాధ చూడలేక పోయాను. కొన్ని రోజులు నిన్ను వదలాలి అంటేనే ఎంత బాధ పడేదాన్ని. పనికి వెళ్ళినా, ఎప్పుడెప్పుడు నా గోప్పన్న ను చూద్దామా, అన్ని ఎదురు చూస్తూనే వుండే దాన్ని. మరి నువ్వు లేకుండా అప్పుడే ఆరు నెలలు గడిపేసా. ఎలాగడుపుతున్నాను? నిర్దాక్షణ్యంగా నిన్ను తీసుకుపోయిన ఆ దేవుడికే తెలుసు.

గోపన్న కు గత డిసెంబర్ లో చిగురు మీద చిన్న కురుపు వచ్చింది. సాయంత్రాలలో ఆడు కొనేటప్పుడు ఫ్రీజ్బి ని విసిరి వేస్తే ఆత్రంగా పరిగెత్తు కొంటు వెళ్లి తెచ్చేవాడు. అప్పుడు ఫ్రీజ్బి మీద రక్తం కొంచం కనిపించేది. కొరుకున్నాడేమో అనుకోనే వాళ్ళము. నోరు తుడిచి నీళ్లు తాగించేదాన్ని. డిసెంబర్ వాడి రొటీన్ చెక్ అప్ లో, వేట్నెరియన్ కు చిన్న కురుపు చూపించారు. ఆయన “వర్రీ కాకండి. చూద్దాం అది కానీ డబుల్ అయిందంటే మళ్లీ రండి” అన్నారు.

రోజు గోపన్నకు మా వారు బ్రష్ చేసే వారు. దాని వల్ల కూడా అలా అయిందని అనుకొన్నము. వాడు బ్రష్ కూడా, మాతో పాటు బాత్ రూమ్ ఓపికగా కార్పెట్ మీద కూచొని చేయించు కొనేవాడు. ఒక్క రోజు కూడా చేసుకోకుండా పడుకొనే వాడు కాదు. తప్పకుండా మంచి దిన చర్యలు, వాటిని తప్పకుండా పాటించడం, వాడి దగ్గర నేర్చుకోవాల్సిందే.

పుండు పెద్దగా అయ్యింది డాక్టర్ చెప్పినట్టే డబుల్ సైజ్. జనవరి లో మళ్ళీ వెళ్ళాము డాక్టర్ వెంటనే కాన్సర్ ఉండచ్చు. ఆన్కాలజిస్టు అపోయింట్మెంట్ తీసుకొమ్మని చెప్పాడు. మరో క్యాన్సర్ హాస్పిటల్ కి ఫోన్ చేసి తీసుకున్నాము.

గోప్పన్న మాములు గా వాడి రొటీన్ తో సంతోషంగానే వున్నాడు. దేవుడ్ని ఎంతో మొక్కుకున్నా. కానీ దేవుడు దయ చూపలేదు. పరీక్షలు, బయాప్సీ చేశారు. ఆన్కాలజిస్ట్ రిజల్ట్స్ చూసి, "లాభం లేదు, కీమో, రేడియేషన్ ఇచ్చిన కష్టమే. ప్రశాంతంగా ఉంచేయండి" అన్నాడు. మళ్ళీ వెట్ డాక్టర్ కు చూపిస్తే అదే అన్నారు. కొన్నిరోజులు స్టెరాయిడ్, పెయిన్ కిల్లర్స్ ఇచ్చాము. ఆంటీబయటిక్స్ ఇచ్చాము. టాబ్లెట్స్ ఏది ఇచ్చిన ఏమాత్రం సతాయించ కుండా, గబ, గబ తినేసి ఏమి కానట్టు తిరిగేవాడు.

ఏప్రిల్ కంతా కురుపు పెద్దగా అయ్యి చీము పట్టి, నోరు మూసు కోలేనంత పెద్దగా అయ్యింది. అయిన నా గోపన్న నాకు ఏమాత్రం కష్టం కలిగించలేదు. సంతోషంగా తోక ఊపుతూ నా వెనుక తిరుగు తూ వున్నాడు. కానీ నాకు తెలుస్తూనే ఉంది పిల్లాడు కష్టపడుతున్నా డని.

స్టెరాయిడ్ తినడంవల్ల బాగా లావు అయి, బెడ్ మీద ఎక్కలేక పోయేవాడు. ఎత్తి పడుకోబెట్టాల్సిందే. ఎక్కించమని బెడ్ పక్కన నిలుచోనుండేవాడు. రాత్రులలో ఊపిరి అడకుండా చాలా అవస్థ పడుతుండేవాడు. కానీ కొంచెం శబ్దమైనా అరవడం, తలుపు దగ్గర పరిగెత్తడం, వాడి డ్యూటీ ఏది వదల లేదు. నిజంగా వాడు మమ్మల్ని కన్నా పిల్లలు లా కాపాడేవాడు. ఎవ్వరిని మా దగ్గరికి రానివ్వడు.

కర్మజీవి.

ఈసారి డాక్టర్ దగ్గరికి వెళ్ళినప్పుడు, ఆయన అన్నారు, "లాభం లేదు మీ కో ఫోన్ నంబర్ ఇస్తాను. లాప్ ఆఫ్ లవ్అనే సంస్థ.. ఫోన్ చేయండి

వారు " ఉతెనీసియా" గురించి వివరించి, డాక్టర్ ని మీ ఇంటికే పంపుతారు. డాక్టర్ ముందు నొప్పి లేకుండా ఇంజెక్షన్ ఇచ్చి తరువాత ప్రశాంతంగా ప్రాణం పోవడానికి మరో ఇంజెక్షన్ ఇస్తారు. ఇది మీ గోపన్నకు ఈ బాధ నుండి విముక్తి పొందడానికి మీరు మాత్రమే ఇవ్వగల వరం."

చెప్పలేంత బాధ. యిలా చేయడానికి ఒప్పు కొంటానా.!

చీము ఎక్కువై దుప్పటంతా అంత చీము, రక్తంతో ఉంటోంది..ఊపిరి అడకుండాఅవస్థపడుతున్నాడు. రోజు షీట్స్ మార్చడం, వీలయినంత వరకు నొక్కి చీము తీసేయడం చేసే వాళ్ళము. ఇంటికి ఎవరు వచ్చిన "ఇంకా ఎన్ని రోజులూ యిలా వుంచుతారు వాడికి కష్టం, మీకు కూడా అనేవారు." మా వారు కుడా నా అంగీకారం కోసం వేచి చూస్తున్నారు, అని కొంత ఆలస్యంగానే అర్థం అయ్యింది.

నా స్వార్థం తో వాడ్ని ఉంచుకోవాలా?

ప్రశాంతంగా పంపిచేసేయాలా?

చాలా రోజులూ నాలో నేనే సతమత మైయ్యాను. మాఅబ్బాయి కూడా వే రే డాక్టర్స్ తో మాట్లాడి బాధ పడుతూ "అమ్మ, లాభం లేదు ప్రశాంతంగా పంపించేద్దా" మని అన్నాడు

చివరకు, నేను మంచి అమ్మ నైతే వాడు కష్ట పడకూడదు, అని ఒక్క బుధవారం చెప్పేసాను. అంతే నాకిష్టమైన సాయిబాబా రోజు గురువారం రమ్మని లాప్ ఆఫ్ లవ్ కు మా వారు ఫోన్ చేసి చేప్పేశారు.

గురువారం పొద్దున 11 గంటలకు వస్తామని లేడీ డాక్టర్ చెప్పారు. నైట్ అంత నిద్ర లేదు. పొద్దున్నే వాడు అమాయకంగా ఎగురుతూ, తింటూ నన్ను వదల కుండా తిరుగుతున్నాడు. లాన్ మూవర్ అతను వస్తే వాడ్ని అరుస్తూ ఇల్లు చుట్టు పరిగెడుతున్నాడు.

వాడు వెళ్లి పోవడం నేను చూడలేనని మా అన్నా కొడుకు సాకేత్ వచ్చి లైబ్రరీ కి తీసుకెళ్లాడు. గొప్పన్న కు సాకేత్ అంటే కూడా చాలా ఇష్టం..ట్రీట్ అన్నా అనేవాడు.

తరువాత తెలిసింది మా వారు చెప్పగా. ఇష్టంగా కుకీస్, ఐస్ క్రీం, ఇష్టామయిన వన్నీ తిన్నాడటా.

వచ్చిన డాక్టర్ కూడా ట్రీట్స్ ఇచ్చిందట. అమాయక రత్నం, అవి తింటున్నప్పుడు ఇంజక్షన్ ఇచ్చారట. స్లో గా నిద్ర లోకి జారుకున్నాడట. ఈయన ఎత్తుకొని పూజ గది లో చేర్ మీద తన లాప్ లో పడుకోపెట్టుకొన్నారట. నిద్ర లో ప్రశాంతం గా ఉన్నాడని తెలిసాక ఇంకో ఇన్జెక్షన్ ఇచ్చేసారు. వాడి ఫుట్ ప్రింట్, వెంట్రుకలు మాత్రమే నాకు మిగిల్చి ఇంకో లోకానికి వెళ్ళిపోయాడు, నా బుజ్జి కన్నా!

లైబ్రరీ నుండి ఇంటికి రాగానే రిసీవ్ చేసుకోవడానికి నా గోపన్న రాలేదు. నన్ను వదిలి పోవాలి అని వాడికి తెలిస్తే ట్రీట్ ఏది ఇచ్చిన తినే వాడు కాదు. ఎదురు వచ్చి కంప్లైంట్ చేస్తున్నట్లు ముఖం పెట్టేవాడు.

నీ కథ రాస్తుంటే చెప్పలేంత ఏడుపు వస్తోంది రా నాన్న.

నువ్వు నాకిచ్చిన సంతోషం, ఎన్ని జన్మ లకు నీ ఋణం తీర్చుకోగలను?

గొప్ప వాళ్ళు వాళ్ళ ఆత్మ కథ వాళ్ళే రాసుకుంటారు. లేకపోతే మరెవరో రాసి పెడతారు.మరి నా గోపన్న ఎంత గొప్పవాడు, వాడి కథ ఎవరు రాస్తారు ఈ అమ్మ తప్ప.

గోపన్న లేని నా ఇంటిలో అడుగు పెడుతుంటే,

వాడి లేని ఆ ఇల్లు...!? భయం వేసింది...!!!

COMMENTS